దోమలు విజృంభిస్తున్నాయి..

- గ్రామాల్లో నియంత్రణ చర్యలు కరువు
- ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు
- వీధుల్లో వర్షం నీరు నిల్వ
- పందుల స్వైర విహారం


గృహాల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు


వీధిలో నిల్వ ఉన్న వర్షం నీరు

మరిపెడ రూరల్: వానాకాలంలో వర్షాలు కురుస్తున్న కారణంగా గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. విపరీతంగా స్వైరవిహారం చేస్తూ ప్రజల కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. దోమలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో మొత్తం 48 గ్రామ పంచాయతీలు కలిగి ఉన్నాయి. కానీ గ్రామ పంచాయతీల్లో నిధులు కొరత కారణంగా దోమల నియంత్రణకు చేపట్టే చర్యలు కరువయ్యాయని తెలుస్తోంది. దోమల నియంత్రణకు ఉపయోగించే ఫాగింగ్ మిషన్లు మూలనపడ్డాయి. ప్రత్యేక అధికారుల పాలనలో దోమల నియంత్రణను ఎవరు పట్టించుకోకపోవడంతో పలు గ్రామాల్లో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైన దోమల నియంత్రణకు పంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

వానాకాలం కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని వీధులు, గుంతల్లో వర్షం నీరు నిలుస్తుంది. అదేవిధంగా ఖాళీ ప్రదేశాలు, అంతర్గత వీధుల వెంట పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో దోమలకు అవి ఆవాసాలుగా మారి వృద్ధి చెందుతున్నాయి. దీంతో సాయంత్రం దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామాల్లో వర్షం, మురుగు నీరు నిల్వలు లేకుండా చేయడంతోపాటు పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పందుల స్వైర విహారం


గార్లలో సంచరిస్తున్న పందులు

గార్ల: గార్ల పట్టణంలోని ప్రతీ వీధిలో పందులు స్వైరవిహారం ఎక్కువై వీధుల్లో పారిశుద్ధ్యం లోపిస్తుంది. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోడం లేదని గార్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం సీజన్ కావడంతో సైడ్ కాలువలు, చెత్తకుప్పల వద్ద పందులు గుంపులు గుంపులుగా సంచరిస్తుంతుండటంతో విష జ్వరాలు సోకే అవకాశం ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన పాలన అందిస్తున్న కాంగ్రెస్

- ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: గత ప్రభుత్వాలు చేయని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, ప్రజలకు మెరుగైన పాలనను అందిస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి రైతువేదిక భవనంలో మండలానికి కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కేసముద్రం మండలానికి 4,839 రేషన్‌కార్డులు మంజూరయ్యాయని, 51,893 మంది కొత్త సభ్యుల చేర్పులు జరిగాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ క్రాంతి, కేసముద్రం, ధన్నసరి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, రావుల మురళీ, బండారు వెంకన్న, వేముల శ్రీనివాస్‌రెడ్డి, కొల్లూరి శ్రీనివాస్, వోలం రమేశ్, అయూబ్ ఖాన్ పాల్గొన్నారు.


కేసముద్రం: రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

ఇంటికో మొక్క నాటాలి

మహబూబాబాద్ రూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం ఇంటికో మొక్క నాటాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలోని బోడగుట్టతండాలో ఎమ్మెల్యే మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘుపతిరెడ్డి, ఎంపీఓ పార్థసారథి, ఏపీఓ రమేష్ రెడ్డి, అజ్మీరా సత్తెమ్మ, సురేష్ పాల్గొన్నారు.

దాశరథి జయంతి వేడుకలు


చిన్నగూడూరు: దాశరథి విగ్రహానికి పూలమాల వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


మహబూబాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నిజాం రాజులతో పోరాడి 'నాతెలంగాణ కోటి రతనాల వీణ' అని వెలుగెత్తి చాటిన మహనీయుడు దాశరథి అని కొనియాడారు. - సాక్షి నెట్‌వర్క్


కురవి: పూలమాల వేస్తున్న హెచ్‌ఎం వెంకన్న

పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మించాలి

గార్ల: పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పాకాల ఏటి వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. దశాబ్దాల కాలంగా పాలకులు మారుతున్నా ఈ ప్రాంత ప్రజల రాతలు మారడం లేదన్నారు. ఎన్నికల ముందు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాత్రం ప్రచారం చేసేందుకు వచ్చిన సమయంలో తమను గెలిపిస్తే కచ్చితంగా పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పి వెళ్తారే తప్ప, గెలిచిన అనంతరం ఇటువైపు కన్నెత్తి కూడా చూడరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నాలో పార్టీ మండల కార్యదర్శి అలువాల సత్యవతి, అంబటి వీరస్వామి, పెద్దవెంకటేశ్వర్లు, నాగమణి, అలువాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

యువకుడి అదృశ్యం


బాబు

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు కూలిగా వచ్చిన చిన్నకొండ బాబు అనే యువకుడు కనిపించడంలేదని ఎస్సై గంగ్రాతి సతీష్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ఏపీలోని ఈస్ట్ గోదావరి జిల్లా రాఘవేంద్రాపురం, గూటినదేవికి చెందిన చిన్న కొండబాబు కొంతకాలంగా కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో జరుగుతున్న రోడ్డు పనుల్లో కూలీగా పనిచేస్తున్నాడు. ఈనెల 6వ తేదీన ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడని , ఇప్పటి వరకు ఇంటికి చేరుకోకపోవడంతో చిన్న కొండబాబు బావ మేఘవు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై సతీష్ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ లభిస్తే 87126 56956 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

జాతీయ జెండాను గౌరవించాలి

తొర్రూరు: ప్రతి వ్యక్తి జాతీయ జెండాను గౌరవించుకోవాలని లయన్స్‌క్లబ్ జిల్లా జీఎల్‌టీ సమన్వయకర్త వి.శారద అన్నారు. మంగళవారం జాతీయ జెండా డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించారు. కార్యక్రమంలో తుమ్మూరు శ్రీదేవిరెడ్డి, క్లబ్ కోశాధికారి మంజుల, రేణుకారెడ్డి, ఉమారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలి

చిన్నగూడూరు: పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలని తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ యాకయ్య పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను మంగళవారం వారు సందర్శించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ లలిత, టీచర్స్, సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీ తనిఖీ

నర్సింహులపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఎంపీడీఓ పి.రాధిక ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.


చిన్నగూడూరు: వంటగది పరిశీలిస్తున్న అధికారులు

ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకుంటాం..


బాలికలకు అవగాహన కల్పిస్తున్న రవినాయక్

కురవి: గోదావరి నదిలో తెలంగాణ నీటి వాటాను కాపాడుకుందామని, బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకుంటామని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ రవినాయక్ అన్నారు. మంగళవారం నేరడ గ్రామంలోని మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి దీపక్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీళ్లు, నియామకాలు, నిధులే లక్ష్యంగా తెలంగాణ ఉద్యమం జరిగిందన్నారు. గోదావరి నది నుంచి 200వందల టీఎంసీల నీటిని అక్రమంగా ఏపీ సీఎం చంద్రబాబు దోచుకునే యత్నం చేస్తూ బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నారని తెలిపారు. తెలంగాణ వాదులందరు ఏకమై ప్రాజెక్టును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నూకల అనిల్, బాదావత్ సురేష్, జక్కుల సందీప్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూములను కాపాడాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో వక్ఫ్‌బోర్డు భూముల్లో పలువురు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వక్ఫ్‌బోర్డు భూములను కాపాడాలని జిల్లా మైనార్టీ సంఘం బాధ్యులు ఎండీ. ఖాదర్ హుస్సేన్, ఎస్డీ అక్తర్‌పాషా అన్నారు. జిల్లా కేంద్రంలో మైనార్టీ కార్యాలయంలో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ నిజాముద్దీన్‌కు సంఘం బాధ్యులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానుకోట జిల్లా గూడూరు మండలం బొద్దుగొండ గ్రామం కొల్లాపురంలో మసీద్‌కు చెందిన ఖబ్రాస్తాన్ స్థలం సర్వే నంబర్ 136 భూమిని ఆక్రమించి ఇట్టి స్థలంలో నిర్మాణం చేస్తున్నారని, వెంటనే వారిపై చర్య తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె. సలీం, సాబీర్‌హుస్సేన్, ఎండీ.అక్రమ్, మునీర్, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న సంఘం బాధ్యులు

కనీస వేతనాలు అమలు చేయాలి


మాట్లాడుతున్న చాగంటి వెంకటయ్య

గూడూరు: జీపీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తూ, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలో మంగళవారం జీపీ యూనియన్ మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడే జీపీ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 23, 24 తేదీల్లో గార్ల మండల కేంద్రంలో జరుగుతాయని, కార్మికులు హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అప్పిరెడ్డి, పురుషోత్తం, వెంకటయ్య, మోహినోద్దీన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్లాట్‌ఫాం లేక ప్రయాణికుల ఇబ్బందులు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం వెంటనే నాల్గో నంబరు ప్లాట్‌ఫాం నిర్మించాలని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, వసతుల కల్పన పనులను మంగళవారం సీపీఐ బృందం పరిశీలన చేశారు. ఈసందర్భంగా అజయ్ సారథిరెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బజార్ వైపున రైల్వే ప్లాట్‌ఫాం ఏర్పాటు కోసం బుధవారం భగత్‌సింగ్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నామని తెలిపారు. వివిధ రైళ్లు ఎక్కేందుకు వచ్చి వెళ్లే ప్రయాణికులు నాల్గో నంబరు ప్లాట్‌ఫాం లేక కొత్త ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైల్వే అధికారులు స్పందించి ప్రజల అవస్థలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, గాదం శ్యాంప్రసాద్, జోనికెని రమేష్, వంగూరి నాగేంద్రబాబు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

విద్యార్థుల భద్రత అందరి బాధ్యత

తొర్రూరు: విద్యార్థుల భద్రత అందరి బాధ్యత అని ఎస్సై జి. ఉపేందర్ అన్నారు. పోలీస్‌శాఖ, షీటీం ఆధ్వర్యంలో విద్యార్థుల భద్రతపై మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల వాడకంపై తలెత్తే అనర్థాలపై, బాలికలు, మహిళల భద్రతపై ఎస్సై ఉపేందర్, షీ టీం ఎస్సై సునంద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి, కళాజాత సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి బంద్‌ను జయప్రదం చేయాలి

గార్ల: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నేటి విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్ మంగళవారం పిలుపునిచ్చారు.

రూ.20లక్షల చెక్కు అందజేత



గార్ల: తెలంగాణ గ్రామీణ బ్యాంకు గార్ల బ్రాంచ్‌లో రూ.1000 ప్రమాద బీమా చేసుకొని 9నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వెంకటరత్నం కుటుంబ సభ్యుడు కె.బిక్షమయ్యకు మంగళవారం గార్లలో బ్యాంకు వరంగల్ రీజినల్ మేనేజర్ చైతన్యకుమార్ రూ.20లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ యాకూబ్‌నాయక్, నోడల్ ఆఫీసర్ రాజు, శోభన్, రంజిత్ పాల్గొన్నారు.

సీరోలు ఎస్సైగా సంతోష్



కురవి: సీరోలు మండల కేంద్రంలోని సీరోలు ఎస్సైగా సంతోష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన మరిపెడ రెండో ఎస్సైగా విధులు నిర్వహించారు. సీరోలులో పనిచేసిన నగేష్ నార్కోటిక్స్ విభాగానికి బదిలీ కాగా ఆయన స్థానంలో సంతోష్ విధుల్లో చేరారు.

ఇశ్రాయేల్‌కు ఉత్తమ సేవా అవార్డు



నెల్లికుదురు: పట్టణానికి చెందిన జీవీ ఇశ్రాయేల్ ఉత్తమ సేవా అవార్డు దక్కింది. హోలీ ప్రిన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకుడు కొమ్ము ప్రవీణ్ చేతుల మీదుగా మంగళవారం అవార్డును అందుకున్నారు. మరికొన్ని సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడతానని ఇశ్రాయేల్ తెలిపారు.

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రభాకర్



మహబూబాబాద్ అర్బన్: ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీని ఎనుకున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట సత్యానారాయణ, పెంట అంజయ్ మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చాగంటి ప్రభాకర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

సన్మానం



మరిపెడ రూరల్: మరిపెడ పట్టణానికి చెందిన కానిస్టేబుల్ ఎండీ అబ్దుల్ ఖదీర్ కంప్యూటర్ అవేర్నెస్ ప్రోగ్రాంలో గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. ఈసందర్భంగా మంగళవారం ఎస్పీ రామ్‌నాథ్ కేకన్ కానిస్టేబుల్‌ను సన్మానించారు.

వైద్యం అందుబాటులో ఉంచాలి

బయ్యారం: సీజనల్ వ్యాధులు కాలం మొదలైనందున ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందుబాటులో ఉంచాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని దొరన్న విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుందామంటే సరైన మందులు, వైద్యులు అందుబాటులో లేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు వీరభద్రం, చైతన్య, పాపయ్య, భద్రయ్య, రమేష్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఈనెల 24న జరగనున్న పోరాటాన్ని విజయవంతం చేయాలని యూఎస్‌పీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు మల్లారెడ్డి, సిద్దోజు కవిత పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యాకూబ్, రమేష్ దేవేందర్‌రాజు, వెంకటేశ్వర్లు, సంజీవ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోరాటానికి సిద్ధం కావాలి

గూడూరు: వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్‌లు పెంచే విషయమై మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అధికార ప్రతినిధి మిడతపల్లి యాకయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సంఘం సమావేశం నిర్వహించారు.

జయప్రదం చేయండి

మరిపెడ: పనిగంటల పెంపునకు నిరసనగా ఈనెల 31న కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) జిల్లా నాయకుడు బానోతు రాంలాల్ పిలుపునిచ్చారు. ఈమేరకు మరిపెడ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, శివాజీ కృష్ణ, వెంకన్న, మోతీలాల్, పద్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

జీవ ఎరువులతో అధిక లాభాలు

చిన్నగూడూరు: రైతులు జీవ ఎరువులతో అధిక లాభాలు రాబట్టవచ్చునని మండల వ్యవసాయ అధికారి భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఉగ్గంపల్లి రైతువేదికలో జీవ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.

బ్యాంక్‌ను పునరుద్ధరించాలి

దంతాలపల్లి: మండల కేంద్రంలో గల ఎస్‌బీఐ బ్యాంకును పునరుద్ధరించాల బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ తెలిపారు. మంగళవారం జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

బంద్‌కు డీవైఎఫ్‌ఐ మద్దతు

నెల్లికుదురు: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌కు డీవైఎఫ్‌ఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని సంఘం రాష్ట్ర నాయకుడు ఎండీ.రజాక్ మంగళవారం తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

బయ్యారం: మండలంలోని బోటితండాకు చెందిన బాధావత్ దస్మా(70) తరచూ అనారోగ్యంతో బాధపడుతుంది. ఈక్రమంలో మనస్తాపంతో ఈనెల 2న పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. ఈమేరకు మృతురాలి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థికసాయం



మహబూబాబాద్ రూరల్: తెలంగాణ ఉద్యమకారుడు గుంజె హనుమంతు సంతాప సభను మంగళవారం ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, బానోత్ రవికుమార్, మార్నేని వెంకన్న, రఘు బీఆర్‌ఎస్ పార్టీ తరఫున రూ.22,500 ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో డోలి సత్యనారాయణ, వెంకన్న, పిల్లి సుధాకర్ పాల్గొన్నారు.

వాడిపోతున్న మొక్కజొన్న పరిశీలన

బయ్యారం: మండలంలోని సంతులాల్‌పోడుతండా సమీపంలో మూడున్నర ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న వాడిపోతుందని రైతు నాయిని వెంకన్న ఆవేదన వ్యక్తం చేశాడు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి రాంజీ వాడిపోతున్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి

కేసముద్రం: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సీపీఎం కార్యకర్తలు సిద్ధం కావాలని పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాజు, మార్తినేని పాపారావు, వెంకన్న, వెంకటేశ్వర్లు, జయరాజ్, నర్సయ్య పాల్గొన్నారు.

ఇద్దరు మహిళల మధ్య ఘర్షణ

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో మహిళా వంట మనిషి, మహిళా వాచ్‌మెన్‌లు మంగళవారం మధ్యాహ్న సమయంలో ఘర్షణ పడ్డారు. వంతులు వారీగా పనులు నిర్వహించుకున్నారు. ఈక్రమంలో పని విషయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. చివరికి గొడవ పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. ఇద్దరికి గాయాలు కావడంతో ఉపాధ్యాయులు 108కు ఫోన్ చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై డీఈఓను వివరణ కోరగా విచారణ జరిపి ఇద్దరు మహిళలను విధుల నుంచి తొలగిస్తామన్నారు.

నూనె పడి ముఖానికి తీవ్రగాయాలు

గూడూరు: ముఖం కాలి ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రంలోని చెంద్రుగూడెంలో సోమవారం జరిగింది. మంగళవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెంద్రుగూడెంకు చెందిన పడాల అనసూర్య శ్రీనివాస్ అనే వ్యక్తిని పెంచుకుంది. శ్రీనివాస్‌కు పెళ్లి అయిన కొంత కాలానికి భార్య విడిపోయింది. అప్పటి నుంచి శ్రీనివాస్ మద్యానికి బానిసై డబ్బుల కోసం తల్లి అనసూర్యతో గొడవ పడుతుండేవాడు. సోమవారం తల్లీకొడుకుల మధ్యన జరిగిన గొడవలో శ్రీనివాస్ ముఖంపై వేడి నూనె పడి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించారు. కొడుకు బాధ తట్టుకోలేక తల్లి పెనంలో ఉన్న వేడి నూనె పోసిందా? అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

టై, బెల్టుల వితరణ

తొర్రూరు: తొర్రూరు మాజీ సర్పంచ్ ధరావత్ రాజేష్‌నాయక్ ఆధ్వర్యంలో పట్టణంలోని దుబ్బతండా పాఠశాలకు రూ.10వేల విలువగల సౌండ్ బాక్స్, అంబేడ్కర్ నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం టై, బెల్టులు వితరణ చేశారు. సీఆర్పీ కల్పన స్కూల్ బ్యాగులు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ మహంకాళి హెచ్‌ఎంలు చైతన్య, సరిత, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ప్రేమ్‌చందర్‌రెడ్డి, సునీత పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్..

- చోరీ సొత్తును కొనుగోలు చేసిన ఇద్దరు వ్యక్తులకు నోటీసులు

మహబూబాబాద్ రూరల్ : అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి చోరీ సొత్తును కొనుగోలు చేసిన ఇద్దరు వ్యక్తులకు నోటీసులు ఇచ్చి వారి వద్ద నుంచి రూ.3 లక్షల విలువైన రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నామని మహబూబాబాద్ ఇన్‌చార్జ్ సీఐ పి.సర్వయ్య మంగళవారం తెలిపారు. మహబూబాబాద్‌లో టౌన్ ఎస్సై అశోక్ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. కురవి మండలం తాట్య తండాకు చెందిన బాధావత్ గాంధీగా గుర్తించి విచారించారు. మహబూబాబాద్‌లో ఈ నెల 16వ తేదీన హెచ్.పీ గ్యాస్ గోదాం ఎదుట పార్క్ చేసిన ఓ ఆటోను అపహరించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో బొమ్మిడి సతీశ్ అనే వ్యక్తికి విక్రయించాడు. మరుసటి రోజు రాత్రి తొర్రూరు బస్టాండ్ దగ్గర ఓ ఇంటి ఎదుట పార్క్ చేసిన ఆటోను అపహరించి బొమ్మిడి సతీశ్ సాయంతో ఏపీలోని వేలూరుకు చెందిన బెల్లంకొండ నాగేశ్‌కు అమ్మినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి చోరీ సొత్తును కొనుగోలు చేసిన ఇద్దరు వ్యక్తులకు నోటీసులు ఇచ్చామని ఇన్‌చార్జ్ సీఐ పేర్కొన్నారు. కాగా, నిందితుడు కురవి, మహబూబాబాద్ టౌన్, మేడిపల్లి, ఘట్ కేసర్, ఉప్పల్, కీసర ప్రాంతాల్లో పలు చోరీలకు పాల్పడినట్లు ఇన్‌చార్జ్ సీఐ సర్వయ్య పేర్కొన్నారు.

జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేయాలి

గూడూరు: మండల కేంద్రంలో జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటుకు కృషి చేయాలని న్యాయవాది భూక్య సురేష్‌నాయక్, మాజీ ఎంపీపీ చెల్పూరు వెంకన్న కోరారు. మండలంలోని మచ్చర్ల శివారు జాతీయ రహదారి పక్కన గల జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ గృహంలో మంగళవారం వారితో పాటుమాజీ సర్పంచ్ వాంకుడోతు మోతీలాల్‌నాయక్, హెల్త్ అసిస్టెంట్ భూక్య వెంకన్న, నవ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు రామన్ననాయక్ కల్సి హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. కోర్టు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.